క్లుప్తంగా

నేడు మెగా రక్తదాన శిబిరం



గుడివాడ టౌన్: ఇండియన్ మెడికల్ అసోసియేషన్ గుడివాడ వారి ఆధ్వర్యంలో శుక్రవారం మెగారక్తదాన శిబిరం నిర్వహించనున్నట్లు ఐఎంఏ అధ్యక్షుడు డాక్టర్ మాగంటి శ్రీనివాస్ తెలిపారు. గురువారం ఆయన వ్యక్తిగత కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. శుక్రవారం ఉదయం ఐఎంఏ, ఏపీ వలంటీర్ బ్లడ్ బ్యాంక్ ఆధ్వర్యంలో ఈ శిబిరం నిర్వహించనున్నట్లు తెలిపారు. పట్టణ పరిసర ప్రాంత ప్రజల అవసరాల నిమిత్తం పట్టణంలో రక్తనిల్వలు పెపొందించేందుకు ఈ శిబిరం నిర్వహిస్తున్నామన్నారు. స్వచ్ఛంద సేవాసంస్థల ప్రతినిధులు, కళాశాలల విద్యార్థులు, పట్టణ ప్రజలు పాల్గొని రక్తదాన కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరారు.

బాణసంచా అక్రమంగా తయారు చేస్తే చర్యలు

గుడివాడరూరల్: దీపావళిని పురస్కరించుకుని మండలంలో ఎక్కడైనా బాణసంచా అక్రమంగా తయారు చేసినా, నిల్వ ఉంచినా కఠిన చర్యలు తీసుకుంటామని గుడివాడ తాలూకా ఎస్ఐ ఎన్.చంటిబాబు పేర్కొన్నారు. మండలంలోని బొమ్ములూరులో గురువారం తెల్లవారుజామున బాణసంచా అక్రమ నిల్వలపై సిబ్బందితో కలసి తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అనుమతులు లేకుండా బాణసంచా తయారు చేయడం చట్టరీత్యా నేరమన్నారు. అలాగే బాణసంచా నిల్వ చేసినా చర్యలు తీసుకుంటామన్నారు.

పౌష్టికాహారంతోనే ఆరోగ్యం



వెంట్రప్రగడ(పెదపారుపూడి): గర్భిణులు, బాలింతలు పౌష్టికాహారం తీసుకుంటే ఆరోగ్యంగా ఉంటారని వెంట్రప్రగడ సెక్టార్ ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఎం. శివనాగమణి అన్నారు. మండలంలోని వెంట్రప్రగడ అంగన్‌వాడీ కేంద్రంలో పోషకాహార మాసోత్సవాలను గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా సూపర్‌వైజర్ మాట్లాడుతూ కిషోర్ బాలికలు, గర్భిణులు, బాలింతలు పోషక విలువ కలిగిన ఆహారం తీసుకోవాలన్నారు.

గుడ్లవల్లేరులో..

గుడ్లవల్లేరు: మండలంలోని అంగలూరు అంగన్‌వాడీ కేంద్రంలో గురువారం పోషకాహారంపై అవగాహనా సదస్సును నిర్వహించారు. గర్భిణులు, బాలింతలు, తల్లులకు ఐసీడీఎస్ సూపర్‌వైజర్ నసీరున్నీసా అవగాహన కల్పించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్త ఉషారాణి పాల్గొన్నారు.

పేదలకు దుప్పట్ల పంపిణీ



గుడ్లవల్లేరు: లయన్స్ క్లబ్ ఆఫ్ గుడ్లవల్లేరు వారి ఆధ్వర్యంలో స్థానిక లయన్స్ సేవాభవన్‌లో గురువారం పేదలకు అన్నదాన కార్యక్రమాన్ని చేపట్టారు. మండా వెంకటేశ్వరరావు జ్ఞాపకార్థం కుటుంబ సభ్యులు పేదలకు అన్నదానం చేసి, దుప్పట్ల పంపిణీని చేపట్టారు. కార్యక్రమంలో లయన్స్ ప్రతినిధులు వైపీసీ ప్రసాద్, పెరుమాళ్లు, నవాబు పాల్గొన్నారు.

తొమ్మిది బాణసంచా దుకాణాలకు అనుమతి

కూచిపూడి(మొవ్వ): దీపావళిని పురస్కరించుకుని మొవ్వ మండలంలో తొమ్మిది బాణసంచా దుకాణాలకు అనుమతులు ఇచ్చినట్లు తహసీల్దార్ కే మస్తాన్ తెలిపారు. అధికారుల బృందం గురువారం స్థలాలను పరిశీలించి, ఎంపిక చేసినట్లు పేర్కొన్నారు. పెదపూడిలో పెడసనగల్లు రోడ్డులోని వర్తక సంఘ కల్యాణమండపంలో మూడు దుకాణాలు, నిడుమోలు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల్లో రెండు దుకాణాలు, కోసూరు కో–ఆపరేటివ్ సొసైటీ, కాజ జిల్లా పరిషత్ హైస్కూల్లో ఒక్కొక్క దుకాణం, మొవ్వ కల్యాణ మండపంలో ఒకటి, కూచిపూడి రోడ్డులో పొలాల దగ్గరలో ఒకటి మంజూరు చేసినట్లు తెలిపారు. వీటిని కూచిపూడి ఎస్ఐ కేవీఎస్ విశ్వనాథ్, మొవ్వ ఫైర్ ఆఫీసర్ కె వెంకటేశ్వరరావు, పామర్రు ఫైర్ ఆఫీసర్ వెంకటేశ్వరరావు, ఎలక్ట్రికల్ ఏఈ రమేష్, ఆర్ఐ విజయదుర్గ తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

గుడివాడ టౌన్: నందివాడ 33 కేవీ సబ్ స్టేషన్ పరిధిలోని గ్రామాల్లో విద్యుత్ లైన్ల మరమ్మతుల కారణంగా శుక్రవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని ఎలక్ట్రికల్ డీఈ జీబీ శ్రీనివాసరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. నందివాడ మండలంలోని నందివాడ, తుమ్మలపల్లి, జనార్దనపురం, తమిరిశ, శ్రీనివాసపురం, వెన్ననపూడి తదితర గ్రామాల్లో ఉదయం తొమ్మిది నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు పేర్కొన్నారు.


నాణ్యతలేని రేషన్ బియ్యం సరఫరా!

- ప్రశ్నించిన వారిపై డీలర్ల దురుసు ప్రవర్తన
- పేదలకు అందించే బియ్యంలో పురుగులు
- రేషన్ సరఫరాపై కొరవడిన అధికారుల పర్యవేక్షణ

గుడివాడరూరల్: పేదలకు రేషన్ దుకాణాల ద్వారా ప్రభుత్వం అందించే రేషన్ బియ్యం నాణ్యత లేకుండా అందిస్తున్నారని పలువురు లబ్ధిదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గుడివాడ అర్బన్, రూరల్, నందివాడ మండలాల్లో పలు రేషన్ షాపుల ద్వారా నాణ్యత లేని బియ్యాన్ని ప్రజలకు సరఫరా చేస్తున్నా సంబంధిత అధికారులు పర్యవేక్షణ లేకుండా పోయిందని ఆయా గ్రామాల్లోని ప్రజలు ఆరోపిస్తున్నారు. డీలర్లు సరఫరా చేసే 'బియ్యంలో పురుగులు, మట్టి, చెత్త వస్తోందని, ఇదేంటి బియ్యం ఇలా ఉన్నాయి' అని ప్రశ్నిస్తే తమపై రేషన్ డీలర్లు దురుసుగా ప్రవర్తిస్తున్నారని పలువురు వినియోగదారులు వాపోతున్నారు.

ఆ బియ్యం తింటే వ్యాధులు..

ప్రభుత్వం పేదలకు రేషన్ ద్వారా అందించే బియ్యంలో పురుగులు, మట్టి, చెత్త వస్తోందని, ఆ బియ్యాన్ని తింటే వ్యాధుల బారిన పడతామని పేదలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పేదలకు అందించే రేషన్ బియ్యంలో నాణ్యతా ప్రమాణాలు పాటించకుండా ఎలా సరఫరా చేస్తారని ప్రభుత్వాన్ని, పాలకులను ప్రశ్నిస్తున్నారు. రెక్కాడితేగానీ డొక్కాడని పేదల కడుపు నింపుకోవడానికి ఉపయోగపడే రేషన్ బియ్యం కూడా నాణ్యతా ప్రమాణాలు పాటించకుండా, తినేందుకు పని రాకుండా తమకు ఇస్తే ఉపయోగం ఉండబోదని పేర్కొంటున్నారు. ఇప్పటికైనా పాలకులు, అధికారులు స్పందించి నాణ్యత కలిగిన రేషన్ బియ్యాన్ని పేదలకు అందించాలని కోరుతున్నారు.



పురుగులతో ఉన్న రేషన్ బియ్యం



రామనపూడిలో సరఫరా చేసిన బియ్యంలో ఉన్న పురుగులు, మట్టి, చెత్త

బియ్యంలో మట్టి, పురుగులు గుర్తింపు

గుడివాడ మండలంలోని రామనపూడి గ్రామంలో రేషన్ డిపోలో రేషన్ తీసుకునేందుకు ఓ మహిళ వెళ్లింది. ఈ క్రమంలో రేషన్ తీసుకునే సమయంలో బియ్యాన్ని చూసిన మహిళ బియ్యంలో మట్టి, పురుగులు, చెత్తతో నాణ్యత లేకుండా ఉండటాన్ని గుర్తించి డీలర్‌ను ప్రశ్నిస్తే ఆమెపై పరుష పదజాలంతో డీలర్ దూషించినట్లు ఆ మహిళ వాపోయింది. ఆ ఒక్క గ్రామంలోనే కాదు గుడివాడ, నందివాడ మండలాలతో పాటు పట్టణంలో కూడా ఇదేవిధంగా రేషన్ బియ్యాన్ని ప్రజలకు సరఫరా చేస్తున్నారని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

నాణ్యత కలిగిన బియ్యాన్ని ఇవ్వండి



పేదలకు ప్రభుత్వం అందించే రేషన్ బియ్యం నాణ్యత కలిగినవి అందించాలి. నా భార్య ఈ నెల రేషన్ తీసుకునే సమయంలో బియ్యాన్ని గమనిస్తే పురుగులు, మట్టి, చెత్తతో నిండి తినడానికి పనికి రాకుండా ఉన్నాయి. ఇదేమటని ఆ డీలర్‌ను అడిగితే పరుష పదజాలంతో దూషించారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలి.

– సన్నాల కేశవరావు, రామనపూడి, గుడివాడ మండలం

కొడాలి నానిని కలిసిన సిద్ధార్థరెడ్డి

గుడివాడ టౌన్: గుడివాడ మాజీ ఎమ్మెల్యే కొడాలి శ్రీవెంకటేశ్వరరావు(నాని) ని వైఎస్సార్ సీపీ యువజన విభాగం రాష్ట్ర అధ్యక్షుడు బైరెడ్డి సిద్ధార్థరెడ్డి కలిశారు. గురువారం స్థానిక లింగవరం రోడ్డులోని కె కన్వెన్షన్‌లో వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకుడు ఉమాశంకరరెడ్డి కుమారుడి వివాహానికి విచ్చేసిన సిద్ధార్థరెడ్డి కొడాలి నానిని ఆయన నివాసంలో మర్యాద పూర్వకంగా కలిశానని పేర్కొన్నారు.



కొడాలి నానితో సిద్ధార్థరెడ్డి

ఆధ్యాత్మిక భావనను అలవర్చుకోవాలి

వైఎస్సార్ సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి కైలే అనిల్‌కుమార్

పామర్రు(తోట్లవల్లూరు): ప్రతిఒక్కరూ ఆధ్యాత్మిక భావనను అలవర్చుకోవాలని వైఎస్సార్ సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి కైలే అనిల్‌కుమార్ అన్నారు. తోట్లవల్లూరు మండలం పాములలంక గ్రామంలో నిర్వహించిన కుంతీదేవి పండుగను గురువారం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామ దేవతను దర్శించుకుని అనిల్ ప్రత్యేక పూజలను చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఇటువంటి పండుగలు గ్రామస్తుల ఐక్యతను చాటుతాయన్నారు. దేవతలను పూజిస్తే గ్రామాలు సుఖ సంతోషాలు, పాడి పంటలతో విరాజిల్లుతాయన్నారు. ఆధ్యాత్మికతో ఉంటూ అందరూ శాంతి కాముకులుగా జీవించాలన్నారు. అప్పుడే సమాజంలో ఏ విధమైన అరమరికలు లేకుండా ఉంటుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు కళ్లం వెంకటేశ్వరరెడ్డి, జెడ్పీటీసీ సభ్యుడు జొన్నల రామ్మోహన్‌రెడ్డి, మండల ఉపాధ్యక్షులు వెంకటేశ్వరరావు, సర్పంచ్ శీలం రమేష్, రాష్ట్ర జాయింట్ సెక్రటరీ గవాస్కరరాజు , సర్పంచ్‌లు మద్దిరెడ్డి శేషురెడ్డి, రాధిక, ఉదయ్, నరసింహశర్మ, గంగాభవాని, నాయకులు రూబేన్, కొత్తూరి రవి, నాగరాజు, శ్రీకాంత్, విజయ్, ధర్మయ్య తదితరులు పాల్గొన్నారు.



కుంతీదేవి పండుగలో పాల్గొన్న కైలే అనిల్‌కుమార్

పట్టణాభివృద్ధికి మాస్టర్ ప్లాన్

మున్సిపల్ కమిషనర్ మనోహర్

గుడివాడ టౌన్: పట్టణ ప్రజల అవసరాలను దృష్టిలో ఉంచుకుని భవిష్యత్ తరాలకు ఉపయోగపడేలా మాస్టర్ ప్లాన్ తయారు చేస్తున్నామని మున్సిపల్ కమిషనర్ ఎస్.మనోహర్ అన్నారు. గురువారం స్థానిక మున్సిపల్ కార్యాలయం కౌన్సిల్ సమావేశం హాల్లో ప్రజాభిప్రాయ సేకరణ కార్యక్రమం నిర్వహించారు. 40 ఏళ్ల అవసరాలను దృష్టిలో ఉంచుకుని మాస్టర్ ప్లాన్ సిద్ధం చేస్తున్నామన్నారు. సీఆర్డీఏ అధికారులు ప్రస్తుత పట్టణ పరిస్థితిని పట్టణ ప్రముఖులకు, అధికారులకు పవర్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. ప్రజాభిప్రాయాలను పరిగణనలోకి తీసుకుని తుది నిర్ణయం తీసుకుంటామన్నారు. ప్రజలు తమ అభిప్రాయాలను తెలియజేయవచ్చన్నారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే రావి వెంకటేశ్వరరావు, మున్సిపల్ మాజీ చైర్మన్ యలవర్తి శ్రీనివాసరావు, మాజీ కౌన్సిలర్ రాంబాబు, ఆడిటర్ ఎంఆర్ ప్రసాద్, ఆర్యవైశ్యసంఘం అధ్యక్షుడు గంగరాజు, ఏపీ సీఆర్డీఏ డెప్యూటీ డైరెక్టర్ వి.వరహాలుబాబు పాల్గొన్నారు.



పవర్ ప్రజెంటేషన్ ద్వారా పట్టణ పరిస్థితులు వివరిస్తున్న సీఆర్డీఏ అధికారులు

ఆలయ జీర్ణోద్ధరణకు రూ.18వేల విరాళం

గుడ్లవల్లేరు: స్థానిక శ్రీ రమా సహిత సత్యనారాయణ స్వామి దేవస్థాన జీర్ణోద్ధరణ పనులకు గురువారం కాగితం ఆదినారాయణ, జానకీ రమాదేవి దంపతులు రూ.18వేల విరాళం అందజేశారు. కార్యక్రమంలో ఎస్ఈఆర్ఎం విద్యా సంస్థల చైర్మన్ వల్లభనేని వెంకట్రావు, నెహ్రూ పశువుల సంత కమిటీ చైర్మన్ వల్లభనేని సుబ్బారావు, కార్యదర్శి ఈడ్పుగంటి ఉమా, వల్లభనేని బాపయ్యచౌదరి, దేవస్థాన ధర్మకర్తలు మురాల నరేష్, రవి పాల్గొన్నారు.

స్కేటింగ్ పోటీలకు నేషనల్ స్కూల్ విద్యార్థినుల ఎంపిక



కైకలూరు: రాష్ట్రస్థాయి స్కేటింగ్ పోటీలకు కైకలూరు నేషనల్ స్కూల్ విద్యార్థినులు అర్హత సాధించారు. ఈ నెల 11, 12 తేదీల్లో ఏలూరు ఇండోర్ స్టేడియంలో వెస్ట్ గోదావరి రోలర్ స్కేటింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జిల్లా స్థాయి స్కేటింగ్ పోటీలు నిర్వహించారు. నేషనల్ స్కూల్లో జ్ఞానచాతుర్య 5వ తరగతి, రామరశ్మికప్రియ 3వ తరగతి చదువుతున్నారు. వీరు జిల్లా స్థాయిలో జరిగిన వివిధ అంశాల్లో రెండు బంగారు, మూడు వెండి వెరసి ఐదు పతకాలు సాధించారు. దీంతో నవంబరు మొదటి వారంలో కాకినాడలో నిర్వహించనున్న రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. పాఠశాల డైరెక్టర్ గురజాడ చంద్రమోహన్, ఉపాధ్యాయులు విజేతలను అభినందించారు.

హెచ్‌డీఎఫ్‌సీలో బంగారు ఆభరణాలపై రుణాలు

గుడివాడరూరల్: హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ ప్రజలకు మరింత చేరువయ్యేందుకు బంగారంపై తక్కువ వడ్డీతో ఖాతాదారులకు రుణాలు అందిస్తుందని, వాటిని సద్వినియోగం చేసుకోవాలని గుడివాడ డీఎస్పీ వి.ధీరజ్ వినీల్ అన్నారు. స్థానిక సత్యనారాయణపురంలోని కిన్నెర కాంప్లెక్స్‌లో ఉన్న హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్–2లో తక్కువ వడ్డీతో బంగారు ఆభరణాలపై రుణాలు అందించే సేవల కార్యక్రమాన్ని డీఎస్పీ గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బ్యాంక్‌లో వ్యాపార, ఇంటి, వాహనాల కొనుగోలుకు రుణాలు అందిస్తున్నట్లు తెలిపారు. వీటితో పాటు నేటి నుంచి బంగారు ఆభరణాలపై తక్కువ వడ్డీతో రుణాలు అందిస్తోందన్నారు. దీన్ని ఖాతాదారులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ప్రొడక్ట్ హెడ్ జె.కించిత్, బ్రాంచ్ మేనేజర్ గుడ్లవల్లేటి మోహన్ కుమార్ పాల్గొన్నారు.



ఆభరణాలపై రుణ సేవలను ప్రారంభించిన డీఎస్పీ ధీరజ్ వినీల్

తగ్గిన వస్తువుల ధరల వివరాలను ప్రదర్శించాలి

పామర్రు: ప్రతి స్టాల్‌లో జీఎస్టీ ద్వారా తగ్గిన వస్తువుల ధరల వివరాలను ప్రదర్శించాలని ఉయ్యూరు ప్రాంతీయ రవాణా శాఖ అధికారి సుబ్బారావు పేర్కొన్నారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో అడ్మినిస్ట్రేషన్ అధికారి తుంగల మారుతీరావు అధ్యక్షతన రవాణాశాఖ ఏర్పాటు చేసిన సూపర్ జీఎస్టీ–సూపర్ సేవింగ్స్ అవగాహన కార్యక్రమం గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలంతా నాణ్యమైన వస్తువులను కొత్త జీఎస్టీ తగ్గింపు ధరల్లో కొనుగోలు చేయాలని తెలిపారు. సహాయ మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ ఉస్మాని మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం అమల్లోకి తీసుకొచ్చిన జీఎస్టీపై ప్రతిఒక్కరూ అవగాహనతో ముందుకు సాగాల్సిన అవసరం ఉందన్నారు. తొలుత నాలుగురోడ్ల కూడలి నుంచి జీఎస్టీ అమలుపై జరిగే ప్రయోజనాలను వివరిస్తూ ర్యాలీ నిర్వహించారు. జీఎస్టీ అధికారి సలాం, పామర్రు పంచాయతీ కార్యదర్శి అబ్దుల్ సలీం, మార్కెట్ యార్డు కమిటీ చైర్మన్ జన్ను శోభన్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

కైకలూరులో..

కైకలూరు: జీఎస్టీ సంస్కరణలతో రవాణా రంగంలో మెరుగైన ఫలితాలు వస్తున్నాయని ఏలూరు రేంజ్ బ్రేక్ ఇన్‌స్పెక్టర్ వై.సురేష్‌కుమార్ పేర్కొన్నారు. సూపర్ జీఎస్టీ, సూపర్ సేవింగ్స్ కార్యక్రమంలో భాగంగా ఆటోలు, వ్యాన్ డ్రైవర్లతో కైకలూరు వ్యవసాయ మార్కెట్ నుంచి ట్రావెలర్స్ బంగ్లా వరకు ర్యాలీని గురువారం నిర్వహించారు. అనంతరం ట్రావెలర్స్ బంగ్లాలో జరిగిన అవగాహన సమావేశంలో సురేష్‌కుమార్ మాట్లాడారు. ఆటోల కొనుగోలులో జీఎస్టీ తగ్గింపు వల్ల రూ.30వేలు తగ్గిందన్నారు. కైకలూరు రూరల్ సీఐ వి.రవికుమార్ మాట్లాడుతూ ప్రతి ఆటో డ్రైవర్ యూనిఫాం ధరించి, ఆర్‌సీని దగ్గర ఉంచుకోవాలన్నారు. ఎంపీడీఓ ఆర్.రాజబాబు, వైస్ ఎంపీపీ మంగినేని రామకృష్ణ, టౌన్ ఎస్ఐ ఆర్.శ్రీనివాస్, డెప్యూటీ ఎంపీడీఓ అప్పారావు పాల్గొన్నారు.



కైకలూరులో ఆటో కార్మికుల ర్యాలీని ప్రారంభిస్తున్న సీఐ, వెహికల్ ఇన్‌స్పెక్టర్

నత్తగుల్లపాడులో అక్రమ చెరువుకు గండి

ఫారెస్టు అధికారులతో గ్రామస్తుల వాగ్వాదం

కైకలూరు: కొల్లేరు ఆపరేషన్ అలజడి మళ్లీ నత్తగుల్లపాడులో గురువారం కనిపించింది. కొల్లేరు అభయారణ్యంలో అక్రమ చెరువులపై అందిన ఫిర్యాదుపై గట్లును ధ్వంసం చేయడానికి ఫారెస్టు అధికారులు గ్రామానికి వచ్చారు. విషయం తెలుసుకుని గ్రామస్తులు సిబ్బందితో వాగ్వాదానికి దిగారు. దీంతో కొంత సమయం గందరగోళం ఏర్పడింది. ఎట్టకేలకు చెరువుకు గండి కొట్టారు. వివరాల్లోకి వెళితే.. ఈ నెల 6న రాజమండ్రి అటవీశాఖ ప్రధాన కార్యాలయంలో నత్తగుల్లపాడు సర్పంచ్ రామకృష్ణంరాజు గ్రామంలో సర్వే నంబరు 37, 38, 39, 40లో అక్రమ చేపల సాగు చేస్తున్నారని ఫిర్యాదు చేశాడు. స్థానిక డెప్యూటీ రేంజ్ ఆఫీసర్ రంజిత్‌కుమార్ స్థానికులతో కుమ్మక్కయ్యి చెరువులను ధ్వంసం చేయడం లేదని ఆరోపించారు. నత్తగుల్లపాడులో సర్పంచ్, గ్రామస్తులు రెండు వర్గాలుగా వివాదం కొన్నాళ్లుగా సాగుతోంది.

చెరువు గట్టుపై వివాదం

కైకలూరు అభయారణ్యంలో విధులు నిర్వహించే ఎనిమిది మంది ఫారెస్టు సిబ్బంది రేంజర్ కె.రామలింగాచార్యులు, డెప్యూటీ రేంజర్ రంజిత్‌కుమార్ ఆధ్వర్యంలో నత్తగుల్లపాడు వచ్చారు. పొక్లయిన్‌తో గట్టు ధ్వంసం చేయడానికి సమాయత్తమవుతుంటే గ్రామస్తులు సుమారు 30 మంది చేరుకున్నారు. వీరిలో కొందరు అక్రమ చెరువులపై ఫిర్యాదు చేసిన సర్పంచ్ రావాలని పట్టుబట్టారు. చివరకు ఫారెస్టు సిబ్బంది ఉన్నతాధికారుల ఆదేశాలను అమలు చేయాలని చెప్పడంతో గ్రామస్తులు సహకరించారు. ఈ సందర్భంగా ఫారెస్టు రేంజర్ రామలింగాచార్యులు మాట్లాడుతూ గ్రామంలో మొత్తం 4.5 ఎకరాల్లో చేపల సాగు చేస్తున్నారన్నారు. దీనిలో 2.5 విస్తీర్ణం కాంటూరు 5లోని అభయారణ్యంలో ఉందన్నారు. అభయారణ్యంలో చెరువు గట్టుకు గండి కొట్టామని పేర్కొన్నారు. పూర్తి స్థాయిలో సర్వే నిర్వహించి హద్దులు నిర్ణయించాల్సి ఉందన్నారు.



నత్తగుల్లపాడులో చేపల చెరువు గట్టుకు గండి కొట్టిస్తున్న ఫారెస్టు సిబ్బంది

కార్యదర్శులు ప్రజలకు అందుబాటులో ఉండాలి

గుడ్లవల్లేరు: మండలంలోని పంచాయతీ కార్యాలయాల్లోని గ్రామ కార్యదర్శులంతా ప్రజలకు సేవ చేసేందుకు అందుబాటులో ఉండాలని ఎంపీడీఓ ఎండీ ఇమ్రాన్ పేర్కొన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులతో పాటు జూనియర్ అసిస్టెంట్లకు గురువారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలకు సమయానికి సేవలందించాలని సూచించారు.

వాహనం ఢీకొని భార్యాభర్తకు గాయాలు

ముదినేపల్లి రూరల్: గుర్తు తెలియని వాహనం ఢీకొని భార్యాభర్త గాయపడిన ఘటన మండలంలోని పెదపాలపర్రు వద్ద బుధవారం రాత్రి జరిగింది. స్థానిక పోలీసుల కథనం మేరకు మండలంలోని వడాలికి చెందిన కాగిత గోపాలం, శివపార్వతి దంపతులు ద్విచక్ర వాహనంపై గుడివాడ నుంచి వడాలికి వస్తున్నారు. పెదపాలపర్రులోని స్టెర్లిన్ కంపెనీ వద్దకు వచ్చేసరికి ఎదురుగా వచ్చిన కారు ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టి వెళ్లిపోయింది. ఈ ప్రమాదంలో శివపార్వతికి తీవ్రగాయాలయ్యాయి. గోపాలం స్వల్పంగా గాయపడ్డాడు. బాధితురాలి ఫిర్యాదు మేరకు హెడ్‌కానిస్టేబుల్ ఎస్‌వీ రామారావు గురువారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

నాగుల చవితి ఉత్సవాలను విజయవంతం చేయాలి

ముదినేపల్లి రూరల్: ఈ నెల 25న జరిగే నాగుల చవితి ఉత్సవాలను విజయవంతం చేయాలని సింగరాయపాలెం–చేవూరుపాలెం సెంటర్లోని శ్రీసుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయ సహాయ కమిషనర్ ఆర్. గంగా శ్రీదేవి కోరారు. ఆలయంలో జరిగే చవితి వేడుకలకు సంబంధించి స్థానిక ప్రముఖులతో సమావేశాన్ని గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జిల్లాతో పాటు ఇతర ప్రాంతాల నుంచి స్వామిని దర్శించుకునేందుకు అధిక సంఖ్యలో భక్తులు వస్తారన్నారు. ఈ సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా స్థానికులు పర్యవేక్షిస్తూ సహకరించాలన్నారు. అదేవిధంగా సాంస్కృతిక కార్యక్రమాలు సైతం విజయవంతం అయ్యేందుకు కృషి చేయాలని కోరారు. శ్రీహరిపురం సర్పంచ్ పరసా విశ్వేశ్వరరావు, ఆలయ మాజీ చైర్మన్లు పాల్గొన్నారు.



సమావేశంలో పాల్గొన్న స్థానికులు

ఎస్సీలపై చిన్నచూపు తగదు

ముదినేపల్లి రూరల్: సమస్యను పరిష్కరించాల్సిన తహసీల్దార్‌కు ఎస్సీలపై చిన్నచూపు తగదని మండలంలోని చేవూరు దళితులు పేర్కొన్నారు. ఈ గ్రామంలోని దళితవాడకు సమీపంలో అనుమతులు లేకుండా చేపల చెరువులు తవ్వి డ్రెయిన్‌ను పూడ్చివేయడంతో తమ కాలనీ మునిగిపోతుందంటూ రెండు రోజుల కిందట ఎస్సీలు నిరసన వ్యక్తం చేశారు. ఆ సమయంలో సమస్యను పరిష్కరిస్తామని రెవెన్యూ అధికారులు హామీ ఇచ్చారు. గ్రామంలోని ఎస్సీవాడలో గురువారం సమావేశం ఏర్పాటుచేసి చర్చలు జరుపుతామని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో అనుకున్న సమయానికి స్థానిక వీఆర్వో కాలనీకి వచ్చి సమావేశాన్ని వీఆర్వో కార్యాలయం వద్ద ఏర్పాటు చేశామని ఎస్సీలు అందరూ అక్కడికి రావాలని తెలిపారు. దీంతో ఆగ్రహించిన ఎస్సీలు కాలనీలో సమావేశం అని చెప్పి వీఆర్వో కార్యాలయంలో ఏర్పాటు చేయడం ఏమిటంటూ నిరసన తెలిపి సమావేశాన్ని బహిష్కరించారు. కేవలం దళితులమనే చిన్నచూపుతో బడాబాబులతో కుమ్మక్కైన అధికారులు గ్రామంలోని వీఆర్వో కార్యాలయం వద్ద సమావేశాన్ని ఏర్పాటు చేసినట్లు ఆరోపించారు. ముంపు సమస్య పరిష్కరిస్తారని తామెంతో ఆశతో రెవెన్యూ అధికారుల కోసం ఎదురుచూడగా అందుకు భిన్నంగా వ్యవహరించడం శోచనీయమన్నారు. దీనిపై జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తామని పేర్కొన్నారు.

ఆరోపణలు నిజం కాదు

చేవూరు ఎస్సీలు తనపై చేసిన ఆరోపణలు నిజం కాదని తహసీల్దార్ లతీఫ్ పాషా తెలిపారు. సమావేశాన్ని వీఆర్వో కార్యాలయం లేదా పంచాయతీ కార్యాలయం వద్ద ఏర్పాటు చేస్తామని చెప్పామే తప్ప కాలనీలో కాదని స్పష్టం చేశారు. ఎస్సీలపై తమకు ఎలాంటి చిన్నచూపు లేదని పేర్కొన్నారు.



తహసీల్దార్ కోసం ఎదురుచూస్తున్న దళితులు

పారిశుద్ధ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించండి

కైకలూరు: గ్రామాల్లో పారిశుద్ధ్యం మెరుగుపై పంచాయతీ సిబ్బంది ప్రత్యేక శ్రద్ధ వహించాలని ఎంపీడీఓ ఆర్.రాజబాబు పేర్కొన్నారు. పల్లెవాడ గ్రామంలో పారిశుద్ధ్య పనులు, డ్రెయిన్లు, వీధులను గురువారం పరిశీలించారు. సిబ్బందితో మాట్లాడుతూ గ్రామ పంచాయతీల్లో తడి, పొడి చెత్తను విడివిడిగా సేకరించాలన్నారు. డ్రెయిన్లలో మురుగునీరు పారే విధంగా మరమ్మతులు చేసుకోవాలని సూచించారు. సిబ్బంది సమయపాలన పాటించి ప్రజలకు అందుబాటులో ఉండాలన్నారు. వర్షాకాలపు సీజన్‌లో వ్యాధులు ప్రబలకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో డెప్యూటీ ఎంపీడీఓ అప్పారావు తదతరులు పాల్గొన్నారు.



పల్లెవాడలో వీధుల్లో పారిశుద్ధ్యాన్ని పరిశీలిస్తున్న ఎంపీడీఓ రాజబాబు

వాచ్‌మన్ పోస్టుకు దరఖాస్తు చేసుకోండి

పామర్రు: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల భవనం, ప్రాంగణం భద్రతా విధులు నిర్వహించేందుకు వాచ్‌మన్ తాత్కాలిక పోస్టుకు దరఖాస్తులను కోరుతున్నామని కళాశాల ప్రిన్సిపాల్ అరుణకుమార్ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గల వారు ఈ నెల 21వ తేదీ సాయంత్రం నాలుగు గంటల లోపుగా కళాశాల ప్రిన్సిపాల్‌ను సంప్రదించాలని కోరారు.

25న చెరువులో చేపలు వేలం

మండవల్లి: మండలంలోని ఇంగిలిపాకలంక పంచాయతీ మంచినీటి చెరువులో చేపలు పట్టుకునేందుకు ఈ నెల 25వ తేదీ మధ్యాహ్నం 2.30 గంటలకు బహిరంగ వేలం నిర్వహించనున్నట్లు కార్యదర్శి ఎ.సాయి ప్రదీప్ ఒక ప్రకటనలో తెలిపారు. ఉప మండల పరిషత్ అభివృద్ధి అధికారి సమక్షంలో జరిగే ఈ వేలంలో పాల్గొనదలచిన వ్యక్తులు రూ.1,000 ధరావత్తు చెల్లించి పాల్గొనాలని కోరారు.

అన్నసమారాధన

మండవల్లి: స్థానిక ప్రాథమిక ఆరోగ్యకేంద్రం సమీపంలోని శ్రీ దత్త పరంపర సహిత షిర్డీ సాయిబాబా మందిరంలో గురువారం అన్నసమారాధన కార్యక్రమం నిర్వహించారు. స్థానిక ఆత్మూరి వీరాంజనేయులు దంపతుల ఆర్థిక సాయంతో నిర్వహించిన ఈ కార్యక్రమంలో మండవల్లి సమీప గ్రామాల భక్తులు పాల్గొని అన్నప్రసాదాన్ని స్వీకరించారు.

భూముల రీ సర్వేపై ఆరా

నందివాడ: మండలంలో జరుగుతున్న భూముల రీ సర్వేపై అధికారులు ఆరా తీశారు. మండలంలోని జనార్దనపురంలో నిర్వహిస్తున్న రీ సర్వేను సర్వే ఉన్నతాధికారి శ్రీనివాసరెడ్డి తదితరులు పరిశీలించారు. ఈ సందర్భంగా రైతుల పంట భూములకు సంబంధించి కొలతలు సర్వే ప్రకారం పక్కాగా ఉన్నాయా లేదా భూ యజమానులు సరి చూసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఏడీ జోష్నా, సర్వే జిల్లా ఇన్‌చార్జి లీలాప్రసాద్, తహసీల్దార్ గురుమూర్తిరెడ్డి, ఆర్ఐలు రోహేలమ్మ, గణేష్, గ్రామ సర్వేయర్ మహేంద్ర తదితరులు పాల్గొన్నారు.

పోలీసుల అదుపులో జూదరులు

కైకలూరు: మండలంలోని శ్యామలాంబపురం గ్రామంలో పేకాట ఆడుతున్న ఏడుగురిని గురువారం అదుపులోకి తీసుకున్నట్లు కైకలూరు టౌన్ ఎస్ఐ శ్రీనివాస్ తెలిపారు. వీరి వద్ద నుంచి రూ.1,600 స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశామన్నారు. గ్రామాల్లో ఎవరైనా పేకాట, కోడి పందేలు నిర్వహిస్తే సమాచారాన్ని పోలీసులకు తెలియజేయాలని కోరారు